మోసపోతే గోసపడ్తాం

- రాష్ట్ర ప్రగతి దేశానికే ఆదర్శం • అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ ఆశీర్వదించండి
- చిమ్మ చీకటైతదన్నరు.. వెలుగులు జిగేల్లుమంటున్నయి • తెలంగాణలో ఎకరా అమ్మితే.. ఆంధ్రాలో పదెకరాలు
- పటాన్‌చెరులో రెవెన్యూ డివిజన్, పాలిటెక్నిక్ మంజూరు • కొల్లాపూర్‌లో 'డబుల్' ఇళ్ల ప్రారంభం
- పటాన్‌చెరులో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి భూమిపూజ చేసిన సిఎం కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'మోసపోతే గోసపడ్తం.. కొనసాగుతున్న రాష్ట్ర ప్రగతి రాబోయే రోజుల్లోనూ కొనసాగాలంటే ప్రజలు మళ్లీ దీవించాలి.. మనం కడుతున్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు.. మనం ఇస్తున్న ఇంటింటికీ మంచినీళ్లు దేశంలో ఎక్కడా లేవు. చిమ్మ చీకటైతది మీకు కరెంట్ రాదన్నారు. విద్యుత్ వినియోగంలో మనమే దేశంలో నెంబర్ వన్ స్థానంలో ఉన్నాం. ప్రగతి పథంలో తెలంగాణ దేశానికే రోల్‌మోడల్‌గా ఉంది' అని ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు అన్నారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం కొల్లూరులో నిర్మించిన 1660 డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను గురువారం ప్రారంభించి లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. మేధా రైల్వే కోచ్ ప్యాక్టరీని ప్రారంభించారు. అనంతరం పటాన్‌చెరులో రూ.200 కోట్లతో నిర్మించనున్న సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో సిఎం కెసిఆర్ మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్రలో ఒక ఎకరం అమ్మితే తెలంగాణలో పదెకరాల భూమి వచ్చేదని, ఇప్పుడు తెలంగాణలో ఎకరం భూమి అమ్మితే ఆంధ్రాలో పదెకరాలు వస్తుందని మాజీ సిఎం చంద్రబాబునాయుడు అన్నాడని గుర్తు చేశారు. ప్రశాంతమైన జీవన విధానం, పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుండటం వల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయన్నారు. రాబోయే కాలంలో రాష్ట్రం మరింత పురోగమిస్తుందన్నారు. అమరుల త్యాగ ఫలం చాలా గొప్పదని, వారి ఆకాంక్షలు నెరవేర్చడమే నిజమైన నివాళ్లని అన్నారు. రాష్ట్ర మంత్రిగా పనిచేసినప్పుడు పటాన్‌చెరు నియోజకవర్గంలో గల్లి గల్లీలో పాదయాత్ర చేశానని గుర్తు చేశారు. పారిశ్రామిక ప్రాంతమైన పటాన్‌చెరులో ప్రజలకు అత్యాధునిక వైద్య సేవల్ని అందించే లక్ష్యంతో రూ.200 కోట్ల వ్యయంతో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించుకోవడం శుభపరిణామమన్నారు. ఆస్పత్రి నిర్మాణం త్వరగా పూర్తయ్యేందుకు మంత్రి హరీశ్‌రావు చొరవ తీసుకోవాలని సూచించారు. హరీశ్‌రావు హయాంలో వైద్యరంగం బాగా అభివృద్ధి చెందుతుందన్నారు. పెరుగుతున్న రవాణా అవసరాల రీత్యా హయత్‌నగర్ నుంచి పటాన్‌చెరు వరకు మెట్రో లైన్ విస్తరించాల్సిన అవసరముందన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి మంత్రిమండలి సమావేశంలోనే పటాన్‌చెరు వరకు మెట్రోలైన్ విస్తరణ పనులు మంజూరుకు సంతకం చేస్తానని హామీ ఇచ్చారు. పటాన్‌చెరు నియోజకవర్గ అభివృద్ధి కోసం స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అనేకసార్లు కలిసి విన్నవించారని, ఇప్పటికే రిజిస్ట్రేషన్ కార్యాలయం, మూడు మున్సిపాలిటీలు, రెండు మండలాలను ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. కొల్లూరు ప్రాంతంలో ఐటీ పార్కు పెట్టేందుకు మంత్రి కెటిఆర్‌ను పంపిస్తానని, దాని ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల అవసరాలు పెరిగినందున వివిధ అభివృద్ధి పనుల కోసం కొత్తగా ఏర్పాటు చేసిన మూడు మున్సిపాలిటీలకు ఒక్కోదానికి రూ.30 కోట్ల చొప్పున, మూడు కార్పొరేషన్ డివిజన్లకుగాను ఒక్కోదానికి రూ.పది కోట్లు, నియోజకవర్గంలో ఉన్న 55 గ్రామ పంచాయతీలకు గాను ఒక్కోదానికి రూ.15 లక్షల చొప్పున నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. అదే విధంగా రెవెన్యూ డివిజన్‌తో పాటు పాలిటెక్నిక్ కళాశాలను, రామసముద్రం చెరువు సుందరీకరణకు నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. మంత్రి తన్నీరు హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ ఆచరిస్తుంది.. దేశం అనుసరిస్తుంది అన్నట్టుగా రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుపోతోందన్నారు. 24 గంటల పాటు నాణ్యమైన కరెంట్ ఇవ్వడం వల్ల పటాన్‌చెరు ప్రాంతంలో మూడు షిఫ్టుల్లో పరిశ్రమలు నడుస్తున్నాయన్నారు. కార్మికులకు పని లభించడం వల్ల ఆదాయమూ పెరిగిందన్నారు. కాంగ్రెస్ పాలనలో పటాన్‌చెరు ప్రాంతంలో ఉన్న పరిశ్రమలు కరెంట్ కోతల వల్ల నడిచేవి కావని గుర్తు చేశారు. కెసిఆర్ నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో దేశంలో నెంబర్ వన్‌గా ఎదుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ప్రభుత్వ ముఖ్య సలహాదారులు రాజీవ్ శర్మ, ఎంపిలు బీబీపాటిల్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాములు, జడ్‌పి చైర్‌పర్సన్ మంజుశ్రీ, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, మాణిక్యరావు, చంటిక్రాంతికిరణ్, ఎమ్మెల్సీ రఘోత్తమ్ రెడ్డి, రాష్ట్ర వైద్య సేవల, మౌళిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మహిళా కమిషన్ చైర్మెన్ సునీతా లక్ష్మా రెడ్డి, చేనేత అభివృద్ధి సంస్థ చైర్మెన్ చింత ప్రభాకర్, గిడ్డంగుల అభివృద్ధి సంస్థ చైర్మెన్ సాయిచంద్, ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి వైస్ చైర్మెన్ పట్నం మాణిక్యం పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రారంభోత్సవంలో సిఎం కెసిఆర్

ఎంఎస్ఎంఇలకు ఫస్ట్ ఇండియా వర్క్‌షాప్

హైదరాబాద్ : నగరంలోని ఎంఎస్ఎంఇల పరివర్తనకు మద్దతును అందిస్తున్నట్లు ఫస్ట్ ఇండియా పేర్కొంది. ఈ రంగంలో డిజిటల్ మార్పులను కల్పించడానికి ఫోరమ్ ఫర్ ఇంటర్నెట్ రిటైలర్స్, సెల్లర్స్ అండ్ ట్రేడర్స్ (ఫస్ట్ ఇండియా) "ఫ్యూచర్ ప్రూఫింగ్ ఆఫ్ ఇండియన్ ఎంటర్‌ప్రైజెస్" అనే డిజిటలైజేషన్ వర్క్‌షాప్‌ను నిర్వహించినట్లు తెలిపింది. దీంతో చిన్న వ్యాపారాలకు సహాయపడే అవకాశాలపై అవగాహన కల్పించడం, మద్దతు ఇచ్చే లక్ష్యంతో ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. దీనితో వారు డిజిటల్‌గా మారి, స్వయం సమృద్ధితో వ్యాపార నిర్వహణను కొనసాగించుకునేందుకు అవకాశాలు మెరుగవుతాయని తెలిపింది. ఎంఎస్ఎంఇలలో డిజిటలైజేషన్‌కు మద్దతునిచ్చి.. దేశ ఆర్థిక వ్యవస్థకు ఈ రంగం సహకారాన్ని పెంచడం, దాని ప్రస్తుత వాటాను అధిగమించడమే తమ లక్ష్యమని ఫస్ట్ ఇండియా ట్రస్టీ అధ్యక్షుడు వినోద్ కుమార్ పేర్కొన్నారు.

బిసి స్టడీ సర్కిళ్లలో గురుకులాల ఉపాధ్యాయులకు కోచింగ్

- డైరెక్టర్ అలోక్‌కుమార్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని అన్ని టిఎస్‌బిసి స్టడీ సర్కిళ్లలో బుధవారం నుంచే గురుకులాల్లో ఉపాధ్యాయులకు కోచింగ్ ఇస్తున్నట్టు స్టడీ సర్కిల్ డైరెక్టర్ అలోక్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బిసి (ఎబిడి గ్రూపు) కమ్యూనిటీకి చెందిన అభ్యర్థులు డిగ్రీ, బీఈడీ లో 40శాతం ఆపైన ఉత్తీర్ణులైన వారు వెంటనే నేరుగా టిఎస్ స్టడీ సర్కిల్, ఒయు సెంటర్, తార్నాక హైదరాబాద్‌లో గురుకులం కోచింగ్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. తల్లిదండ్రుల ఆదాయం సంవత్సరానికి రూ. ఐదు లక్షలలోపు ఉండాలని తెలిపారు. అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం స్టడీ మెటీరియల్ అందించనున్నట్టు తెలిపారు. ఇతర వివరాల కోసం . 040-2407-1178, 040-27077929 ని సంప్రదించాలని సూచించారు.

త్వరలో మెడికల్ కౌన్సిల్‌కు ఎన్నికలు

- వైద్య సంఘాలతో రేపు చైర్మన్ సమావేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

త్వరలో మెడికల్ కౌన్సిల్‌కు ఎన్నికలు నిర్వహించనున్నట్టు తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ (టిఎస్ఎంసి) చైర్మన్ డాక్టర్ వి.రాజలింగం తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయా వైద్యసంఘాల అధ్యక్ష, కార్యదర్శులకు లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మెడికల్ కౌన్సిల్‌కు నిర్వహించనున్న తొలి ఎన్నికలివే. ఈ నేపథ్యంలో రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ల ఎన్నికలను పూర్తి చేసేందుకు తగిన ప్రణాళిక రూపొందిస్తున్నట్టు తెలిపారు. ఎన్నికలు సాఫీగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు చేయాల్సిందిగా మెడికల్ అసోసియేషన్ల ప్రెసిడెంట్, సెక్రెటరీలను కోరారు. ఈ నెల 24న (శనివారం) మధ్యాహ్నం 2 గంటలకు సరోజినీ దేవీ కంటి ఆస్పత్రిలో జరిగే సమావేశానికి హాజరు కావాల్సిందిగా కోరారు. ఒకవేళ అధ్యక్ష, కార్యదర్శులు హాజరు కాకపోతే వారి ప్రతినిధిని పంపించాలని సూచించారు.

హెచ్ఆర్‌డిఎ పోరాట ఫలితం

టిఎస్ఎంసి ఎన్నికల ప్రక్రియను ప్రారంభించడం పట్ల హెల్త్‌కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్ఆర్ డిఎ) హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కె.మహేశ్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలను నిర్వహించాలంటూ హెచ్ఆర్ డిఎ పోరాడిందని గుర్తు చేశారు. 2012 నుంచి ఎలక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.

మా కౌన్సిళ్లకు ఎన్నికలెప్పుడు?

టిఎస్ఎంసి ఎన్నికల నిర్వహణకు ముందుకు రావడంతో వైద్యవర్గాల్లో హర్షం వ్యక్తమవుతున్నది. అదే సమయంలో మెడికల్ డాక్టర్ల మాదిరిగానే డెంటల్ డాక్టర్లు, నర్సులు తమ కౌన్సిళ్లకు ఎన్నికలు నిర్వహించాలని కోరుతున్నారు. ఆయా కౌన్సిళ్లకు ఎన్నికలు నిర్వహిస్తే విధాన నిర్ణయాల్లో తమ ప్రతినిధులు సమస్యలపై చర్చించి, పరిష్కరిస్తారని వారు ఆశిస్తున్నారు.

ఎన్‌టిఆర్ వ్యక్తిత్వం ఆదర్శప్రాయం : బాలకృష్ణ

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బాలకృష్ణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి, తన తండ్రి ఎన్‌టిఆర్ వ్యక్తిత్వం అందరికీ ఆదర్శప్రాయమని నటుడు, బసవతారకం ఆస్పత్రి చైర్మన్ నందమూరి బాలకృష్ణ అన్నారు. ఎన్నో అనుభవాల సమాహారం ఎన్‌టిఆర్ అని చెప్పారు. బసవతారకం ఆస్పత్రి వార్షికోత్సవ వేడుకలు గురువారం ఆస్పత్రి ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో నూతన పరికరాలను బాలకృష్ణ ప్రారంభించారు. వేడుకల్లో బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పివి సింధు, ప్రణవి చంద్ర, నటి శ్రీలీల పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాలకృష్ణ మాట్లాడుతూ.. క్యాన్సర్‌పై పెద్దగా అవగాహన లేని రోజుల్లో తన తల్లి బసవతారకం కోరిక మేరకు ఆస్పత్రిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 2000లో రూ.నాలుగు కోట్లతో ఆస్పత్రిని ప్రారంభించినట్లు వెల్లడించారు. బసవతారకం ఆస్పత్రి ఏర్పాటులో టిడిపి అధినేత చంద్రబాబు ఎంతో సహకారం అందించారని పేర్కొన్నారు. ఇవాళ అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చి క్యాన్సర్‌కు చికిత్స అందిస్తున్నామని తెలిపారు. దేశంలోనే రెండో ఉత్తమ క్యాన్సర్ ఆస్పత్రిగా నిలిచిందన్నారు. పివి సింధు మాట్లాడుతూ.. బసవతారకం ఆస్పత్రిని ఉత్తమ సేవలు అందిస్తున్న ఆస్పత్రిగా నీతిఆయోగ్ గుర్తించడం ఆనందంగా ఉందన్నారు. ఇప్పటివరకు మూడు లక్షల మందికి పైగా రోగులకు సేవలు అందించడం గొప్ప విషయమని చెప్పారు.

పరీక్షల నిర్వహణలో కీలకమైన అంశాలు ఎందుకు విస్మరించారు..?

- టిఎస్‌పిఎస్సిని ప్రశ్నించిన హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కీలకమైన పరీక్షల నిర్వహణలో కీలకమైన అంశాలు ఎందుకు విస్మరించారని హైకోర్టు టిఎస్‌పిఎస్సిని ప్రశ్నించింది. ఓఎంఆర్ షీటుపై హాల్‌టికెట్ నంబర్, ఫొటో ఎందుకు లేవని, అభ్యర్థుల బయోమెట్రిక్ సేకరించకపోవడం ఏంటని అసహనం వ్యక్తంచేసింది. అక్టోబరులో చేసినవన్నీ రెండోసారి ఎందుకు చేయలేదు, పరీక్షల్లో అక్రమాల నిరోధించడంలో కీలకమైన అంశాలను ఎందుకు విస్మరించారని ధర్మాసనం అడిగింది.గ్రూప్-1 ప్రిలిమ్స్ రద్దు చేయాలన్న పిటిషన్‌పై గురువారం హైకోర్టులో విచారణ జరిగింది. అభ్యర్థుల బయోమెట్రిక్ సేకరించకపోవడం, ఓఎంఆర్ షీటుపై హాల్‌టికెట్, ఫొటో లేకపోవడం అనుమానాస్పదంగా ఉందని పిటిషనర్లు కోర్టు దృష్టికి తెచ్చారు. పరీక్షల ఏర్పాట్లు ఎలా చేయాలన్నది టిఎస్‌పిఎస్సి విచక్షణ అధికారమన్న కమిషన్ తరపు న్యాయవాది.. గ్రూప్-1 ప్రిలిమ్స్ ఏర్పాట్లపై అభ్యర్థులెవరూ అభ్యంతరం చెప్పలేదన్నారు. బయోమెట్రిక్, ఓఎంఆర్‌పై ఫొటోకు సుమారు రూ.1.50 కోట్లు ఖర్చవుతోందని తెలిపారు. ఆధార్ వంటి గుర్తింపు కార్డు ద్వారా ఇన్విజిలేటర్లు అభ్యర్థులను ధ్రువీకరించారని కోర్టు దృష్టికి తెచ్చారు. పరీక్ష నిర్వహణ విషయంలో ఖర్చులు ముఖ్యం కాదని, పరీక్ష పారదర్శకంగా జరిగేందుకు తగిన ఏర్పాట్లు చేయడం టిఎస్‌పిఎస్‌సి బాధ్యత అని ఈ సందర్భంగా ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. పరీక్ష నిర్వహణకోసం అభ్యర్థుల నుంచి ఫీజు తీసుకున్నారు కదా? అని ప్రశ్నించింది. వీటన్నింటిపై మూడు వారాల్లో కౌంటరు దాఖలు చేయాలని టిఎస్‌పిఎస్‌సికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది.

యుఐటిపి అవార్డు కోసం నామినేషన్లకు ఎల్‌అండ్‌టీ మెట్రో ఎంపిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ (యూఐటీపీ) అవార్డులు-2023 కోసం స్పెయిన్‌లోని బార్సిలోనాలో ఈ నెల నాలుగు నుంచి ఏడు వరకు యుఐటిపి గ్లోబల్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎలివేటింగ్ మల్టీమోడల్ ట్రాన్సిట్ ఎక్స్‌పీరియన్స్ ఇన్ హైదరాబాద్, ఇండియాపై సమర్పించిన నామినేషన్ ఫైనలిస్ట్‌లలో ఒకటిగా ఎల్అండ్‌టీ మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్ (ఎల్‌టిఎంఆర్‌హెచ్ఎల్) ఎంపికైంది. మల్టీమోడల్ ఇంటిగ్రేషన్ కేటగిరీ కింద వచ్చిన 500 నామినేషన్‌లలో ఎల్‌టిఎంఆర్‌హెచ్ఎల్ నామినేషన్ ఫైనలిస్ట్‌లలో ఒకటిగా షార్ట్‌లిస్ట్ చేశారు.ఈ సందర్భంగా ఎల్అండ్‌టీ ఎంఆర్‌హెచ్ఎల్ సిఎండి కెవిబి రెడ్డి మాట్లాడుతూ.. తమ నామినేషన్ ఫైనలిస్ట్‌లలో ఒకటిగా షార్ట్‌లిస్ట్ కావడం గర్వకారణమని తెలిపారు. హైదరాబాద్‌కు, ప్రయాణీకులకు పర్యావరణ అనుకూలమైన రవాణాను అందించడంలో తమ ప్రయత్నాలను గుర్తించినందుకు అసోసియేషన్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. హైదరాబాద్ మెట్రో రైలు ప్రయాణీకుల అవసరాలకు ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. సురక్షితమైన, సమర్థవంతమైన రవాణా పరిష్కారాలను అందించడానికి అంకితం చేయడం జరిగిందన్నారు.

బోనమెత్తిన గోల్కొండ

- జగదాంబికా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు
- ఆషాఢ మాసం బోనాలకు అంకురార్పణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గోల్కొండ కోట బోనమెత్తింది. డప్పు చప్పుల్ల హోరు, శివసత్తుల పూనకాలు, పోతరాజుల నృత్యాలు.. యువత కేరింతలతో రాష్ట్రానికి ప్రత్యేకమైన బోనాల పండుగ ఉత్సవాలు గురువారం హైదరాబాద్ గోల్కొండలో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ సంస్కృతికి, సంప్రదాయాలకు అద్దం పట్టే బోనాల ఉత్సవాలు చారిత్రక కోట గోల్కొండ నుంచి తొలి బోనం బయలుదేరడంతో షురూ అయ్యాయి. దాంతో నగరంలో నెల రోజులపాటు జరగనున్న ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్ లంగర్‌హౌస్ చౌరస్తా వద్ద బంగారు బోనానికి దీపం వెలిగించి పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ఊరేగింపును ప్రారంభించారు. ఉత్సవ విగ్రహాలకు ఆలయ కమిటీ సభ్యులు, ప్రధాన అర్చకుల ఇంట్లో పూజలు నిర్వహించారు. లంగర్ హౌస్ నుంచి ప్రారంభమైన రథం, తొట్టెల ఊరేగింపు కోటలోని జగదాంబికా ఆలయం వరకు సాగింది. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ.. బోనాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం 2014 నుంచి 2022 వరకు రూ.78 కోట్లు కేటాయించిందని తెలిపారు. బోనాల పండుగ ముందు రోజే తొలకరి పలకరింపు శుభదాయకం అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రమంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. మంత్రి తలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం రాకముందు ఈ బోనాల జాతర తక్కువ మందితో ప్రారంభమయ్యేదని, నేడు లక్ష మందికి పైగా ప్రజలు గోల్కొండ బోనాల జాతరలో పాల్గొనేందుకు వస్తున్నారని తెలిపారు. బోనాల ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 15 కోట్లు కేటాయించిందని చెప్పారు. దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాలతో పాటు ఇతర ఆలయాలకు కూడా ఆర్థిక సహాయం చేస్తున్నట్టు తెలిపారు.

తెలంగాణ అమరులకు ఘన నివాళి

'అమర జ్యోతి'ని ప్రారంభించిన సిఎం కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ అమరుల సంస్మరణార్థం తెలంగాణ ప్రభుత్వం హుస్సేన్‌సాగర్ తీరాన ప్రతిష్టాత్మకంగా నిర్మించిన అమరజ్యోతిని ముఖ్యమంత్రి కెసిఆర్ గురువారం ప్రారంభించారు. ప్రారంభసూచికగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అమరులకు ఘనంగా పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పోలీసులు మూడు రౌండ్లు గాల్లో కాల్పులు జరిపి అమరవీరులకు గన్ సెల్యూట్ చేశారు. అనంతరం ఆడిటోరియంలోకి వెళ్లి అమరులపై ప్రత్యేకంగా రూపొందించిన డాక్యుమెంటరీని తిలకించారు. ప్రత్యేక రాష్ట్రం కోసం అమరులైన శ్రీకాంతాచారి, వేణుగోపాల్‌రెడ్డి, పోలీసు కిష్టయ్య, సిరిపురం యాదయ్య కుటుంబ సభ్యులను సిఎం, మంత్రులు సత్కరించారు. అనంతరం సిఎం మాట్లాడారు. ఎన్నో కుట్రలు, కుతంత్రాలు జరిగినా ధైర్యంగా పోరాడి తెలంగాణ రాష్ట్రం సాధించి తీరామని కెసిఆర్ అన్నారు. తెలంగాణ తొలిదశ, మలి దశ ఉద్యమాల సందర్భంగా జరిగిన ఘట్టాలను గుర్తు చేశారు. "రాష్ట్ర ఉద్యమ చరిత్ర చాలా పెద్దది. ఈ రోజు రెండు పార్శ్వాలు కలగలిసిన రోజు. సంతోషం ఒక పాలు.. విషాదం రెండు పాళ్లుగా ఉన్నాయి. తెలంగాణ ఉద్యమంలో ఎన్నో పేర్లు తలచుకోవాలి. ఖమ్మం జిల్లా ఇల్లందులో ఉద్యమ తొలికేక వినిపించింది. ఉద్యమాన్ని ప్రారంభించే ముందు పిడికెడు మందితో మేధోమథనం చేశాం. వ్యూహాత్మకంగా మలిదశ ఉద్యమం ప్రారంభించాం. ప్రొఫెసర్ జయశంకర్ ఆజన్మ తెలంగాణ వాది, ఆయన మార్గదర్శనంలోనే నడిచాం. ఉద్యమ స్ఫూర్తిని జయశంకర్ కాపాడుకొంటూ వచ్చారు. రాజీనామాలను అస్త్రాలుగా వాడి ఉద్యమం నడిపాం. నాపై జరిగినంత దాడి ప్రపంచంలో ఏనేతపైనా జరిగి ఉండదు. తెలంగాణ వచ్చుడో.. కెసిఆర్ సచ్చుడో అంటూ ఉద్యమం నడిపా. నా నిరాహార దీక్ష తర్వాతే తెలంగాణ ప్రకటన వచ్చింది. ఆ తర్వాత కూడా ఎన్నో కుట్రలు జరిగాయి. పార్లమెంట్‌లో పెప్పర్ స్ప్రే చల్లే స్థాయికి దిగజారారు. ఉద్యమంలో విద్యార్థుల ఆత్మబలిదానాలు నన్ను తీవ్రంగా కలచివేశాయి. అమరులను నిత్యం స్మరించుకునేందుకే అమర జ్యోతి ఏర్పాటు చేశాం" అని సిఎం కెసిఆర్ వివరించారు.

ప్రయివేట్ మెడికల్ కాలేజీల్లో రెండోరోజు ఇడి సోదాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ వ్యాప్తంగా ఉన్న పలు మెడికల్ కళాశాలల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సోదాలు రెండో రోజు గురువారం కొనసాగాయి. ప్రయివేటు వైద్య కళాశాలల్లో పిజి సీట్లు బ్లాక్ చేసి.. అధిక ధరలకు అమ్ముకున్న తీరుపై ఇడి దృష్టి సారించించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలోని హైదరాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని వైద్య కళాశాలల్లో ఇడి అధికారుల సోదాలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని కామినేని వైద్య కళాశాలలో ఇడి సోదాలు ముగిశాయని అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది ప్రయివేటు వైద్యకళాశాలలకు సంబంధించి 16 ప్రాంతాల్లో ఇడి బృందాలు బుధవారం ఏకకాలంలో సోదాలు మొదలు పెట్టాయి. ఇడి కార్యాలయం నుంచి పలు వాహనాల్లో ఉదయమే బయలుదేరిన బృందాలు వైద్య కళాశాలలతోపాటు నిర్వాహకుల కార్యాలయాలు, ఇళ్లల్లో విస్తృతంగా సోదాలు నిర్వహించాయి. సిఆర్‌పిఎఫ్, ఆర్ఎఎఫ్ బలగాలు ఇడి బృందాలకు రక్షణ కల్పించాయి. కళాశాలల్లో కీలక ప్రతినిధుల్ని బయటికి వెళ్లనీయకుండా ఆపిన ఉదయం నుంచి రాత్రివరకు ఇడి అధికారులు సోదాలు కొనసాగించాయి.

అక్రమాలు ఇలా...

రాష్ట్రంలోని కొన్ని ప్రయివేటు వైద్య కళాశాలలు.. కొందరు మెరిట్ విద్యార్థులు, దళారులతో కుమ్మక్కై పిజి సీట్ల బ్లాకింగ్ దందాకు పాల్పడ్డాయనేది ప్రధాన ఆరోపణ. ముందుగానే ఓ కళాశాలలో కన్వీనర్ కోటాలో పీజీ సీటు పొందిన విద్యార్థి.. మరో కళాశాలలోనూ చివరి విడత కౌన్సెలింగ్ వరకు సీటు బ్లాక్ చేయడమే ఈ దందాలో కీలకం. అలా చివరి వరకు ఆ సీటు బ్లాక్ అయి ఉండటంతో మిగిలిన విద్యార్థులు ఆ సీటు పొందే అవకాశం ఉండదు. అలా మిగిలిపోయే సీటును కళాశాల నిర్వాహకులు సొంతంగా భర్తీ చేసుకునే వెలుసుబాటు ఉంటుంది. అలా పెద్దమొత్తంలో డబ్బు తీసుకొని సీట్లను విక్రయించారనేది కొన్ని ప్రయివేటు కళాశాలలపై కాళోజీ వర్సిటీ వర్గాలు మోపిన అభియోగం. గత ఏడాది 45 సీట్లు పక్కదారి పట్టినట్లు వర్సిటీ వర్గాల అంతర్గత విచారణలో తేలింది.

జులై 9న టిటిజిడిఎ సర్వ సభ్య సమావేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ టీచింగ్ ప్రభుత్వ వైద్యుల సంఘం (టిటిజిడిఎ) సర్వసభ్య సమావేశం జులై 9న హైదరాబాద్‌లోని ఐఎంఎ భవనంలో నిర్వహించనున్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ అన్వర్, డాక్టర్ జలగం తిరుపతిరావు తెలిపారు. గురువారం సంఘం కోర్ కమిటీ సమావేశం జరిగింది. అనంతరం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశంలో ప్రభుత్వ బోధనా వైద్యుల పెండింగ్ సమస్యలు, పిఆర్‌సి బకాయిలపై చర్చించారు. దీనికి సంబంధించిన ఫైలు ముఖ్యమంత్రి కార్యాలయంలో చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. సర్వసభ్య సమావేశం నిర్వహించి, అందులో పిఆర్‌సి బకాయిలు సాధించేందుకు కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు.

'గృహలక్ష్మి' కంటితుడుపు పథకమే

- అర్హులైన ప్రతి పేదవారికి ఇళ్లస్థలం, ఇళ్లు ఇవ్వాలి
- రిటైర్డ్ ఎంపిడిఓ హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలి
- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి, జడ్‌పి వైస్ చైర్మన్ భర్త హస్తం ఉన్నట్టు సమాచారం
- ప్రజాసంఘాల ఐక్యపోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్ వీరయ్య

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంటిస్థలం ఉన్నవారికి డబ్బులు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం కేవలం కంటితుడుపు చర్య అని ప్రజాసంఘాల ఐక్యపోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్ వీరయ్య అన్నారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన పేదలకు అందించాలని కోరుతూ నిర్వహిస్తున్న రాష్ట్రవ్యాప్త బస్సు యాత్ర గురువారం జిల్లా కేంద్రమైన సిద్దిపేటకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీరయ్య మాట్లాడారు. గృహలక్ష్మి పథకంతో నిరుపేదలకు ఒరిగేదేమీ లేదన్నారు. ఈ పథకంపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. రాష్ట్రంలో పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు రియల్ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై ప్రభుత్వ భూములను కాజేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములు కాజేస్తున్న వారిపై చర్యలు తీసుకోకపోతే చివరకు పేదలకు జానెడు స్థలం దొరకదన్నారు. గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు ఇళ్లు కట్టుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.పది లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు. గుడిసెలు లేని పేదలకు ప్రభుత్వం 100 గజాల స్థలం ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద నిరుపేదలకు ఇల్లు నిర్మించి ఇస్తామని చెప్పి ఇంతవరకు ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అర్హులైన నిరుపేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, పేదల సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన బస్సు యాత్ర ఈ నెల 27న రంగారెడ్డిలో ముగుస్తుందని తెలిపారు. బస్సు యాత్ర ముగింపు లోపు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పేదల పట్ల సానుకూల నిర్ణయాన్ని తీసుకోవాలని, లేనిపక్షంలో ముగింపు సభలో పోరాట ప్రణాళికను సిద్ధం చేసుకుని రాష్ట్రవ్యాప్త ఉద్యమాలకు సిద్ధమవుతామని అన్నారు.

రిటైర్డ్ ఎంపిడిఒ రామకృష్ణయ్య హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలి

భూమి కబ్జాకు గురవుతుందని, ప్రభుత్వ భూమి కబ్జాదారుల చేతుల్లోకి వెళుతుందని ఆర్‌టిఐ ద్వారా వివరాలు అడిగిన రిటైర్డ్ ఎంపిడిఒ కృష్ణయ్య హత్య వెనుక ఎవరు ఉన్నా కఠినంగా శిక్షించాలని ఎస్ వీరయ్య అన్నారు. రామకృష్ణయ్యను కిడ్నాప్ చేసిన అనంతరం వారి కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పిటిషన్ ఇచ్చినా పోలీసులు పట్టించుకోలేదని ఆరోపించారు. రామకృష్ణయ్య హత్య వెనుక స్థానిక ఎమ్మెల్యే ముత్తిరెడ్డి, జడ్‌పి వైస్ చైర్మెన్ భర్త హస్తం ఉన్నట్టు తమకు సమాచారం ఉందని చెప్పారు. ఈ హత్య కేసును అన్ని కోణాల్లో పరిశీలించి పూర్తిస్థాయిలో విచారణ జరిపి దోషులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించకపోతే ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు పద్మ, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రమేష్ ,వెంకటేష్, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఆనంద్, రైతు సంఘం నాయకులు శోభన్ నాయక్, సోషల్ మీడియా కన్వీనర్ జగదీష్, సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి ,నాయకులు దాసరి కళావతి, గోపాలస్వామి, శశిధర్, రవికుమార్, నవీన, ఎల్లయ్య, ప్రశాంత్, భాస్కర్, శిరీష పాల్గొన్నారు.

NOTE
IN THE COURT OF THE 1st ADDL. SENIOR CIVIL JUDGE AT :: BIDAR
M.V.C. No. **631** of **2022**

DEELIP,
...Claimant
VS
MOHAMMED ISMAIL and another,
...Respondents
Sub: Claim Petition under section 166 of M.V. Act-1988

To,
Respondent No.2 MOHAMMED SUJAUDDIN Son of Mohammed Rahimoddin, Aged: 45 years, Occupation: Owner of Tipper Lorry bearing No. AP-12/U-9912, R/o H.No.19/2, Malchelma Village, Zaheerabad Mendal 502220,T.S.

Whereas the above named claimants failed the petition U/Sec 166 of M.V.Act, through Shivkumar. C.Kadwade, Advocate, Bidar, for grant of compensation on account of accidental injuries sustained to Deelip in a motor vehicle accident that occurred on 22-12-2020 at about 17:30 hours, near Railway track, infront of JJ Function Hall at Zaheerabad, Dattagari School on Chitta Road through, Auto bearing No. KA-38/7585, during the pendency of the case the Claimant No. 1 died, as such IA has filed to bring the L.Rs of the claimant No. 1 on record as Proposed Respondents and the notices Issued to you have been returned unserved which shows that you are wilfully and deliberately avoiding the service of notices.

Therefore, you are hereby call upon to appear In this court at about **11.00** AM on **11-7-2023** either in person or through pleader duly Instructed to give answer for such claims, failing which the matter will be decided/determined in your absence exparte in accordance with law.
Given under my hand and seal of the court, this the **21-6-2023** day of June 2023
//By order of the Court//
CHIEF MINISTERIAL OFFICER
Pri. Senior Civil Judge & CJM Court
BIDAR (Karnataka)

అమరుల త్యాగంతోనే కెసిఆర్‌కు అధికారం

- వైఎస్ షర్మిల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అమరుల త్యాగంతోనే కెసిఆర్‌కు అధికారం వచ్చిందని వైఎస్‌ఆర్‌టిపి అధ్యక్షులు వైఎస్ షర్మిల గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర సాధనకోసం ప్రాణాలను ఫణంగా పెట్టిన వారు ఎందరో అయితే..సాధించిన తెలంగాణలో కొందరే లబ్ధిపొందుతున్నారని పేర్కొన్నారు. స్వరాష్ట్ర సంపదంతా కెసిఆర్ పాలువుతోందని విమర్శించారు. నీళ్లు, నిధులు, నియామకాలన్నీ ఒక్కరింటికే చేరాయని ఎద్దేవా చేశారు. తొమ్మిదేండ్లుగా అమరులపై లేని ప్రేమ ఎన్నికల సమీపిస్తుండటంతో ఇప్పుడు పుట్టుకొస్తోందని తెలిపారు. రాష్ట్ర సాధనకోసం 15 వందల మంది ప్రాణాలు కోల్పోతే..వారి పేర్లు కూడా తెలుసుకోలేని దుస్థితిలో సర్కారు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అందరికీ ఆదుకుంటానని చెప్పి మోసం చేశారని విమర్శించారు. ఇన్నేళ్లుగా గుర్తుకు రాని శంకరమ్మకు ఇప్పుడు ఎమ్మెల్సీ ఇస్తామని చెప్పడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు.

ఇద్దరు మైనర్లపై లైంగిక దాడి

- ఆలస్యంగా వెలుగుచూసిన వైనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

13 ఏళ్ల బాలికపై బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాల్పడిన లైంగికదాడి ఘటన మరవకముందే.. మరో ఇద్దరు మైనర్లపై లైంగికదాడి జరిగిన ఘటనలు ఆలస్యంగా వెలుగుచూశాయి. ఓ ఘటనలో పదేళ్ల బాలికపై మైనర్ అబ్బాయి లైంగికదాడికి పాల్పడగా.. మరో ఘటనలో 16 ఏళ్ల అమ్మాయిపై 21 ఏళ్ల యువకుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ రెండు ఘటనలు నిజామాబాద్ రూరల్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూశాయి. రూరల్ మండలంలోని మారుమూల గ్రామంలో పదేళ్ల బాలికపై 16 ఏళ్ల బాలుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన గురించి ఎవరికైనా చెబితే చంపేస్తానని బాలుడు భయపెట్టినట్లు తెలిసింది. పది రోజులుగా మానసికంగా కృంగిపోయిన బాలిక గురువారం ఆమెకు జరిగిన దారుణాన్ని వాళ్ల మేనమామ దృష్టికి తీసుకెళ్లింది. దాంతో బాలిక తల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కాగా, బాలిక తండ్రి పొట్టకూటి కోసం గల్ఫ్ దేశాలకు వలస వెళ్లాడు. ప్రస్తుతం అబ్బాయి ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. మరో ఘటనలో ముబారక్‌నగర్‌లోని 16 ఏళ్ల అమ్మాయిపై యువకుడు లైంగిక దాడి ఘటన.. అమ్మాయి గర్భందాల్చడంతో రహస్యంగా అబార్షన్ చేయించినట్లు తెలిసింది.

ప్రతి పోడు రైతుకూ పట్టాలు ఇవ్వాల్సిందే..

- సిపిఎం రాష్ట్ర నాయకులు, మాజీ ఎంపి బాబురావు
- ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

ఫారెస్ట్ అధికారులకు వినతి పత్రాన్ని అందజేస్తున్న సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూముల్లో సర్వే పూర్తి చేసి అందరికీ పట్టాలు ఇవ్వాలని, ఆదివాసీలపై అటవీశాఖ అధికారులు వేధింపులు ఆపాలని సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు, మాజీ ఎంపి బాబూరావు, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. సిపిఎం, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పోడు రైతులతో కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఈ-బయ్యారం పోలీస్ స్టేషన్ నుంచి ఫారెస్ట్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కిలోమీటర్ల మేర వేల సంఖ్యలో గిరిజనులతో పాటు ఎటు చూసినా ఎర్ర జెండా రెపరెపలాడింది. ర్యాలీలో భాగంగా ఈ-బయ్యారం క్రాస్ రోడ్‌లో గల కొమరం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి అటవీ శాఖ కార్యాయాన్ని ముట్టడించి పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో పోడు భూముల సమస్య తీవ్రంగా ఉందని, పోడు సాగుదారులపై అటవీ అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎం కెసిఆర్ పోడు భూములకు పట్టాలు ఇస్తామని, అవి ప్రింట్ అయ్యాయని రేపో మాపో అందిస్తామని ఒకపక్క చెబుతున్నారని, మరోపక్క పోడు సాగును అటవీ అధికారులు అడ్డుకుంటున్నారన్నారు. అటవీ భూముల విషయంలో అక్కడి అధికారులు, స్థానికుల మధ్య వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. తెలంగాణలో పోడు భూముల సమస్య అనేది ఇప్పటిది కాదని ఎన్నో సంవత్సరాల నుంచి నలుగుతోందన్నారు. ప్రతిసారీ ఎన్నికలప్పుడు ఇది రాజకీయ అస్త్రంగా మారుతోందని, అధికారంలోకి వచ్చాక ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాబట్టి పోడు భూముల్లో కందకాలు తవ్వినా, ప్లాంటేషన్ వేస్తామని అటవీ శాఖ అధికారులు వచ్చినా ఐక్యంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. అటవీ హక్కుల చట్టం అమల్లోకి వచ్చాక తెలంగాణలో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 96,676 మందికి 3.8 లక్షల ఎకరాలకు పట్టాలు ఇచ్చారని, ఇది జరిగి దాదాపు 14 ఏళ్లు దాటిపోయిందని, ఆ తర్వాత ఇప్పటివరకు అటవీ భూములపై గిరిజనులకు హక్కులు కల్పిస్తూ పట్టాలివ్వలేదన్నారు. అప్పట్లోనూ 1.86 లక్షల మందికి పట్టాలు ఇవ్వలేదని ఎందుకు తిరస్కరించారో చెప్పలేదన్నారు. సాగుచేసుకుంటున్న అందరికీ హక్కులు కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం మాట తప్పితే ఊరుకోమన్నారు. సాగుచేసుకుంటున్న అటవీహక్కుల చట్టం ప్రకారం వారందరికీ పట్టాలు ఇవ్వాలనిడిమాండ్ చేస్తున్నారు. అనంతరం ఫారెస్ట్ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ నిమ్మల వెంకన్న, మండల కమిటీ సభ్యులు మడివి రమేష్, దుబ్బా గోవర్ధన్, కల్లి వెంకటేశ్వర్లు, దడిగల వెంకన్న, నల్లి శంకరయ్య, పాండురంగాపురం సర్పంచ్ ఈసం భవాని, గిరిజనులు పాల్గొన్నారు.

కెసిఆర్ పాలనకు చరమగీతం

- మాజీ ఎంపి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- భట్టి విక్రమార్కకు పరామర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కెసిఆర్ పాలనకు చరమగీతం పాడేందుకే సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క పాదయాత్ర చేపట్టారని ఖమ్మం మాజీ ఎంపి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పాదయాత్రలో భాగంగా నల్లగొండ జిల్లా కేతపల్లి మండల కేంద్రంలో అస్వస్థతకు గురైన భట్టి విక్రమార్కను గురువారం మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డితో కలిసి పొంగులేటి పరామర్శించారు.బీఆర్‌ఎస్ పరిపాలనలో ప్రజల కష్టాలను తెలుసుకొని, కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ఎర్రటి ఎండను, ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా పీపుల్స్ మార్చ్ పాదయాత్ర పేరిట వంద రోజుల్లో 1,150 కిలోమీటర్లు పాదయాత్ర చేసిన సిఎల్‌పి నేత భట్టి విక్రమార్కకు తన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విలేకరుల సమావేశంలో పొంగులేటి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల కలలు నెరవేరాలంటే ఎవరితో సాధ్యమో అందరికీ తెలుసునని పొంగులేటి అన్నారు. ఆ కలలు నెరవేర్చడానికి భట్టి పాదయాత్ర నూటికి నూరు శాతం విజయవంతం కావాలని కోరుకుంటున్నానన్నారు. సిఎం కెసిఆర్ మాయ మాటలతో రెండు పర్యాయాలు అధికారంలోకి వచ్చిన బిఆర్‌ఎస్ ప్రభుత్వం.. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని చెప్పారు. ప్రజల ఆకాంక్షలు కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతాయని, వంద శాతం కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని దీమా వ్యక్తం చేశారు. చేరికల సమయంలో తమ మధ్య సీట్ల ఒప్పందం లేదన్నారు. కేసీఆర్ ఓటమే లక్ష్యంగా ఐక్యతతో పని చేస్తాం అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలోకి ఎవరిని తీసుకోవాలో వద్దో తాను చెప్పే వ్యక్తిని కాదన్నారు. మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలోకి ఖమ్మం మాజీ ఎంపి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని స్వాగతిస్తున్నామన్నారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో డీహైడ్రేషన్‌కు గురైన భట్టి విక్రమార్కను వైద్యులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారని చెప్పారు. అందువల్ల పాదయాత్రకు రెండు, మూడ్రోజులు విరామం ఇవ్వాలని ఒత్తిడి చేసినట్టు తెలిపారు. భట్టి కోలుకున్న తర్వాత సూర్యాపేటలో పాదయాత్ర కొనసాగుతుందని చెప్పారు.

ప్రజల సంపదను దోపిడీ చేస్తున్న బిఆర్‌ఎస్ పాలకులు సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క

కోట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజల సంపదను బిఆర్‌ఎస్ పాలకులు దోపిడీ చేస్తున్నారని సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క ఆరోపించారు. కెసిఆర్ కుటుంబ పాలనకు చరమగీతం పాడేందుకు, తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ కలలు, లక్ష్యాలు నెరవేర్చడానికి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. అప్పుడే ప్రజల జీవితాల్లో మార్పు వస్తుందని గ్రహించి కాంగ్రెస్‌లోకి రావాలని నిర్ణయించుకున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని సిఎల్‌పి పక్షాన స్వాగతిస్తున్నామని చెప్పారు. సోనియా గాంధీ ఆశించిన తెలంగాణ నిర్మాణంలో ప్రధాన భూమిక పోషించాలని కోరారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో సమావేశం అయిన తర్వాత పార్టీలో చేరికలు, పాదయాత్ర ముగింపు సభ తేదీ ప్రకటన ఉంటుందని తెలిపారు. ఎఐసిసి నిర్ణయం మేరకు బహిరంగ సభలు ఉంటాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఖమ్మం సభ ద్వారా ప్రజలకు సందేశం, భరోసా ఇస్తామని చెప్పారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు కంప సాటి శ్రీనివాస్ యాదవ్, ఎంపిపి పెరుమాళ్ల శేఖర్, పిఎసిఎస్ చైర్మెన్ బోళ్ల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవంలో సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్ తదితరులు

మేధా రైల్వే కోచ్ ఫ్యాక్టరీ అద్భుతం

- ఉత్పత్తులు ప్రపంచ దేశాలకు ఎగుమతి చేయడం శుభపరిణామం
- కొండకల్‌లో మేధా రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ప్రారంభంలో సిఎం కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేధా సర్వో డ్రైవ్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ తయారు చేస్తున్న రైల్వే కోచ్, రైల్వే బోగీలు రెండు తెలుగు రాష్ట్రాలకే కాకుండా ప్రపంచ స్థాయిలోనూ ఎగుమతి చేసే స్థాయికి ఎదగడం మహా అద్భుతమని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం కొండకల్ గ్రామంలో వంద ఎకరాల్లో రూ.850 కోట్లతో ఏర్పాటుచేసిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీని గురువారం ఆయన ప్రారంభించారు. రైల్వే కోచ్ విడిభాగాల తయారీ యూనిట్లను మేధా సంస్థ ప్రతినిధులు కశ్యపరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు కెటిఆర్, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, చీఫ్ సెక్రటరీ శాంతికుమారి, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రిన్సిపల్ సెక్రెటరీ జయశ్ రంజన్‌తదితరులతో కలిసి యూనిట్లను సిఎం పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కెసిఆర్ మాట్లాడారు.. 2017లో కోచ్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేయగా తెలంగాణ ప్రభుత్వం కంపెనీకి 310 సర్వే నంబర్‌లో వంద ఎకరాల భూమిని అప్పగిస్తూ ఒప్పందం కుదుర్చుకుందని తెలిపారు. ఈ కంపెనీ ఏర్పాటుతో సుమారు 2000 మందికి ఉద్యోగ అవకాశాలు దక్కుతాయన్నారు. ప్రపంచానికి అవసరమయ్యే రైల్వే విడిభాగాలు రూ.2500 కోట్లతో తయారుచేసే యూనిట్ మన వద్ద ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమని తెలిపారు. రైల్వే కోచ్ తయారీ ఎగుమతులకు కేంద్రంగా ఇక్కడి ప్రాంతం నిలువనుందని చెప్పారు. తెలంగాణ బిడ్డలయిన సంస్థ ప్రతినిధులు కష్యపురెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఎంతో కష్టపడి దేశానికి, ప్రపంచానికి అవసరమైన ప్రాజెక్టును మ్యానుఫ్యాక్చరింగ్ పూర్తి చేసి తనతో ప్రారంభింపజేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి, సంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మంజుల, జిల్లా కలెక్టర్ హరీశ్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం, శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్, ఎంపిపి గోవర్ధన్‌రెడ్డి, జడ్‌పిటిసి గోవిందమ్మ గోపాల్‌రెడ్డి, మేధా కంపెనీ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బాలికపై ఇద్దరు బాలురుల లైంగికదాడి

- జువైనైల్ హోంకు నిందితులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన జరిగింది. గురువారం ఓ బాలికపై ఇద్దరు మైనర్‌లు లైంగికదాడి చేశారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్కేసర్‌లో పనిచేస్తున్న ఓ బాలికను అదే ప్రాంతంలో నివాసముంటున్న ఓ బాలుడు ప్రేమిస్తున్నానని, వివాహం చేసుకుంటానని మాయమాటలు చెప్పి నమ్మించాడు. దాంతో ఆమెను తీసుకెళ్లి ఘట్కేసర్‌లోని స్నేహితుని ఇంటిపైన ఇద్దరూ కలిసి బాలికపై లైంగికదాడి చేశారు. బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని ఇద్దరు బాలురులను అదుపులోకి తీసుకున్నారు. వారిని జువైనైల్ హోంకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి నాయకులతో మాట్లాడుతున్న కాసాని జ్ఞానేశ్వర్

పార్టీకి పూర్వ వైభవమే లక్ష్యంగా..
జులైలో టిడిపి బస్సు యాత్ర

- త్వరలోనే షెడ్యూల్ : కాసాని జ్ఞానేశ్వర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిడిపి పునర్ నిర్మాణం, పూర్వ వైభవమే లక్ష్యంగా జులై మొదటి వారంలో బస్సు యాత్రను చేపట్టనున్నట్టు ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ తెలిపారు. పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి నాయకులతో రూట్‌మ్యాప్ ఖరారుపై చర్చించిన తర్వాత బస్సు యాత్ర షెడ్యూల్‌ను ప్రకటిస్తామని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ భవన్‌లో మల్కాజ్‌గిరి, మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గాల ముఖ్య నాయకులతో జ్ఞానేశ్వర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాసాని మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు ఎంతో దూరంలో లేవనీ, పార్టీ శ్రేణులను ఏకతాటిపైకి తీసుకువచ్చి గెలుపు కోసం శ్రమించాలని పార్టీ నేతలకు సూచించారు. ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో విజయం సాధించడం ద్వారా పార్టీకి పూర్వవైభవం తీసుకువస్తామని అన్నారు. టిఆర్‌ఎస్ బిఆర్‌ఎస్‌గా మారాక, అధికార పార్టీ పట్ల ప్రజా వ్యతిరేకత బాగా పెరుగుతున్నదన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలిచే అవకాశాల్లేవన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు అంతటా సమిష్టి కృషి చేస్తే బస్సుయాత్ర విజయవంతం అవుతుందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా బస్సు యాత్ర విజయవంతమైతే పార్టీకి మంచి ఊపు రావడం తథ్యమని, తద్వారా వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపుకు దోహదపడుతుందన్నారు. వాస్తవానికి తెలంగాణలో టిడిపి ఇప్పటికీ బలంగా ఉందన్నారు. పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు ప్రజా తీర్పును, క్యాడర్ నమ్మకాన్ని వమ్ము చేసి అధికార పార్టీలోకి ఫిరాయించి మోసం చేశారని విమర్శించారు. వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం ముఖ్య నేతలు పార్టీని వీడటంతో కొన్నేండ్లుగా నిస్తేజంలో ఉన్న పార్టీ శ్రేణులు, ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం ద్వారా ఉత్సాహంతో ఉరకలేస్తున్నాయని అన్నారు. తాను టిడిపి పగ్గాలు చేపట్టిన తర్వాత క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి 96 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం ప్రారంభించి పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు నందమూరి సుహాసిని, సాయితులసి తదితరులు పాల్గొన్నారు.

శ్రీక ఈవెంట్స్ సంగీత నృత్య వాయిద్య సమ్మేళన శ్రావ్యం కనువిందు

ప్రజాశక్తి - కల్చరల్

సుమారు పది ఘంటల పాటు నృత్యాలతో శాస్త్రీయ సంగీతం, వాయిద్య గోష్ఠితో ప్రేక్షకులకు కనువిందు చేశారు.. శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన వేదికపై శ్రీక ఈవెంట్స్ శ్రీ రాగ వల్లరి వార్షికోత్సవం పండుగ వాతావరణంలో జరిగింది. జయదేవుని అష్ట పది కీర్తనలను నర్తకీమణులు అద్భుతంగా ప్రదర్శించి గాన సభను నవరస భరతం చేశారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యురాలు డాక్టర్ ఎస్‌పి భారతి పాల్గొని కళాకారులను సత్కరించి మాట్లాడారు. సంగీతం నృత్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు శిక్షణ ఇప్పిస్తే వారు చదువులో ఒత్తిడికి గురికారని ఆత్మ విశ్వాసం కలుగుతుందని అన్నారు. శ్రీక ఈవెంట్స్ ఉన్నత ఆశయంతో ప్రతిభావంత కళాకారులను ప్రోత్సహిస్తోందని అన్నారు. ప్రముఖ సంగీత గాయని డాక్టర్ రమాప్రభ మాట్లాడుతూ నృత్యం, గీతం, గానం కలిస్తే భారతీయ కళలు అన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత రిజిస్ట్రార్ డాక్టర్ సుదర్శన్ సింగ్ అధ్యక్షత వహించిన సభలో సంఖ్యాశాస్త్రవేత్త దైవజ్ఞ శర్మ, సంగీత దర్శకుడు ఆత్రేయ, బిజెపి నాయకుడు వంశీ కృష్ణ పాల్గొన్న సభకు సంస్థ స్థాపకులు ఉదయ శ్రీ , చంద్ర రేఖలు మాట్లాడుతూ తమ సంస్థ ఆన్‌లైన్‌లోను కారోనా సమయంలోను కార్యక్రమాలు చేశామని తెలిపారు గురువులు అహల్యాశైలజ, లలిత వినోద్, నరసింహ ప్రసాద్‌లను సత్కరించారు.

రాజ్యాంగానికే అవమానం!

- పీఠిక నుంచి సామ్యవాదం, లౌకిక పదాలు తొలగింపు
- పదో తరగతి సాంఘికశాస్త్రం పాఠ్యపుస్తకాల ముద్రణ
- విద్యాశాఖ అధికారుల అలసత్వం
- సర్వత్రా విమర్శలు
- అధికారులపై చర్యలు తీసుకోవాలి
- ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజ్యాంగం పట్ల పాఠశాల విద్యాశాఖ అధికారులు తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శించారు. పదో తరగతి తెలుగు, ఆంగ్ల మాధ్యమం సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకాల్లోని రాజ్యాంగ పీఠికలో సామ్యవాదం, లౌకిక పదాల్లేకుండా ముద్రించారు. అయితే ఇది యాదృచ్ఛికంగా జరిగిందా? లేదంటే ఉద్దేశపూర్వకంగా కావాలనే చేశారా? అన్నది చర్చనీయాంశంగా మారింది. భారత్ గొప్ప ప్రజాస్వామ్య, లౌకికదేశమంటూ ప్రపంచమంతా కీర్తిస్తోంది. ఇంకోవైపు 42వ రాజ్యాంగ సవరణ ద్వారా సామ్యవాదం, లౌకిక పదాలను పీఠికలో కేంద్ర ప్రభుత్వం చేర్చింది. కానీ విద్యాశాఖ అధికారులు మాత్రం రాజ్యాంగ పీఠికలో ఆ పదాల్లేకుండా ముద్రించడం తీవ్ర విమర్శలకు దారితీసింది. రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సిఇఆర్‌టి) పాఠ్యాంశాలతో కూడిన సిడి ఆధారంగానే పుస్తకాలను ముద్రిస్తారు. అయితే పదో తరగతి తెలుగు, ఆంగ్ల మాధ్యమం పుస్తకాల్లోనే ఆ పదాల్లేవు. మిగిలిన తరగతులు, మాధ్యమాలకు చెందిన పుస్తకాల్లో వాటిని ముద్రించడం గమనార్హం. అంటే ఎస్‌సిఇఆర్‌టి అధికారులు తీవ్ర అలసత్వం ప్రదర్శించారన్నది స్పష్టంగా అర్థమవుతోంది. దీంతో రాజ్యాంగాన్ని అవమానించారంటూ ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు విమర్శించాయి. సామ్యవాదం, లౌకిక పదాలు తొలగించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. ఇంకోవైపు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగంపై దాడి చేస్తున్నది. రాజ్యాంగ మౌలిక సూత్రాలైన లౌకికవాదం, ప్రజాస్వామ్యం సూత్రాలకు భిన్నంగా అంధవిశ్వాసాలను పెంపొందించేలా జాతీయ విద్యావిధానం (ఎన్ఇపి-2020) ఉందన్న విమర్శలొస్తున్నాయి. శాస్త్రీయ విధానంతో రాసిన సైన్స్, చరిత్రను తొలిగించి, అవాస్తవమైన, అభూత కల్పనలతో కూడిన అంశాలను చరిత్ర పాఠాలుగా ప్రవేశ పెడుతున్నది. ఎన్‌సీఈఆర్టీ సిలబస్ నుంచి గాంధీ, భగత్ సింగ్ పాఠాలతోపాటు జీవ పరిణామ క్రమం, పునరుత్పత్తి పాఠ్యాంశాలను తొలగించటం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మొఘలుల చరిత్ర, గాంధీ హత్య, గుజరాత్ అల్లర్లు తదితర పాఠ్యాంశాలను తొలగించింది. దేశవ్యాప్తంగా ఉన్న ఉన్నత శాస్త్ర సాంకేతిక విద్యాసంస్థలకు చెందిన 1,800 మంది సైన్స్ అధ్యాపకులు, ఉపాధ్యాయులు, శాస్త్రవేత్తలు ఎన్‌సిఇఆర్‌టి చర్యలను తప్పుపడుతూ ఆ సంస్థ డైరెక్టర్‌కు లేఖలు రాశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ విలువలను నిర్వీర్యం చేస్తున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కావాలనే ముద్రించారు : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

పదో తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకం కవర్ పేజీపై రాజ్యాంగ పీఠికలో సోషలిస్టు, సెక్యులర్ పదాల్లేకుండా ముద్రించడం శోచనీయమని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తెలిపారు. లోపలి పేజీలో ముద్రించిన పీఠికలో ఆ రెండు పదాలున్నాయని పేర్కొన్నారు. అయితే ఇది కావాలనే ముద్రించినట్టు కనిపిస్తోందని విమర్శించారు. ఈ తప్పుడు ముద్రణకు బాధ్యులైన వారిపై తగు చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖను డిమాండ్ చేశారు.

ఎస్‌సిఇఆర్‌టి అధికారులపై చర్యలు తీసుకోవాలి : టిఎస్‌యుటిఎఫ్

పదో తరగతి సాంఘిక శాస్త్రం కవర్ పేజీపై రాజ్యాంగ పీఠికలో సోషలిస్టు, సెక్యులర్ పదాలను తొలగించి తప్పుగా ముద్రించిన ఎస్‌సిఇఆర్‌టి అధికారులపై చర్యలు తీసుకోవాలని టిఎస్‌యుటిఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి గురువారం లేఖ రాశారు. 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 1976, డిసెంబర్ 18న ఆ రెండు పదాలను రాజ్యాంగ పీఠికలో చేర్చారని తెలిపారు. ఎనిమిది, పదో తరగతి సాంఘికశాస్త్రం లోపలి పేజీల్లో ఆ రెండు పదాలతో కూడిన రాజ్యాంగ పీఠికను ముద్రించారని గుర్తు చేశారు. దేశంలో లౌకికత్వానికి ప్రమాదం ఏర్పడిందంటూ విశ్వవ్యాప్తంగా చర్చ జరుగుతున్న ప్రస్తుత తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన జాతీయ పాఠ్య గ్రంథాలపై అమల్లో ఉన్న రాజ్యాంగ పీఠికను కాకుండా కొందరు కోరుకుంటున్న విధంగా పాత రాజ్యాంగ పీఠికను ముద్రించడం అనేక అనుమానాలకు ఆస్కారమిస్తున్నదని విమర్శించారు. ఇది ఉద్దేశపూర్వకంగా జరిగినా లేక ఏమరుపాటుగా జరిగినా పెద్ద తప్పిదమేనని తెలిపారు. తప్పుగా ముద్రించిన విషయంపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, సరైన రాజ్యాంగ పీఠికను ముద్రించాలని వారు డిమాండ్ చేశారు.

రాజ్యాంగ పీఠికకు అవమానం : టిపిటిఎఫ్

రాజ్యాంగ పీఠికకు అవమానం జరిగిందని టిపిటిఎఫ్ అధ్యక్షులు వై అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్ విమర్శించారు. సామ్యవాదం, లౌకిక పదాలకు విద్యాశాఖ నీళ్లొదిలిందని తెలిపారు. 1976లో రాజ్యాంగ పీఠిక సవరించబడిందని పేర్కొన్నారు. కొంత మేర అమలవుతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం ఆయా అంశాలను తొలగించాలనే ప్రయత్నంలో ఉన్న క్రమంలో ఆ భావజాలంతో ఉన్న వారు కావాలనే ముద్రించినట్టు భావించాల్సి వస్తోందని తెలిపారు. రాజ్యాంగ పీఠికను తప్పుగా ముద్రించడంలో బాధ్యతారహితంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అమరవీరుల స్మారకంలోనూ బిఆర్‌ఎస్ అవినీతి

- నిర్మాణంలో నాణ్యతా లోపాలు
- శిలాఫలకంపై అమరుల పేర్లు లేకపోవడం దారుణం
- టిపిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అమర వీరుల స్మారకంలోనూ బిఆర్‌ఎస్ అవినీతికి పాల్పడిందని టిపిసిసి అధ్యక్షులు, ఎంపి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆరోపించారు. నిర్మాణంలోనూ నాణ్యతా లోపాలు ఉన్నాయని చెప్పారు. గురువారం గాంధీభవన్‌లో పార్టీ నేతలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. అమరవీరుల స్మారక నిర్మాణ పనుల్లో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. అంచనా వ్యయాన్ని ఇష్టానుసారంగా పెంచారని తెలిపారు. అందులో మంత్రి కెటిఆర్ పాత్ర ఉందని ఆరోపించారు. తెలంగాణ అమరుల స్మారకం చూడగానే వారి పోరాటాలు, త్యాగాలను గుర్తుకురావాలన్నారు. కానీ అమరుల త్యాగాలను రాజకీయ స్వార్థానికి సిఎం కెసిఆర్ ఉపయోగించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్వకుంట్ల చరిత్రనే తెలంగాణ చరిత్ర అన్నట్టు వ్యవహరిస్తున్నారని, అమరుల బలిదానాలను కెసిఆర్ అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణ ఉద్యమంలో 1,569 మంది అమరులయ్యారని గుర్తు చేశారు. త్యాగాలు చేసిన వారిని అవమానించేలా బిఆర్‌ఎస్ వ్యవహరిస్తోందని తెలిపారు. అమరవీరుల స్థూపం నిర్మాణానికి సంబంధించి 2017, జూన్ 17న ప్రభుత్వం నిపుణుల కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. డిజైన్, అంచనాల కోసం, పనులను పరిశీలించేందుకు ఆరు శాతం ఫీజు చెల్లించాలని నిర్ణయించారని తెలిపారు. 2018, జూన్ 28న నిర్మాణం కోసం రూ. 64 కోట్ల వ్యయంతో టెండర్ ప్రకటన చేశారని వివరించారు. ఒకే కంపెనీ మూడు డమ్మీ టెండర్లు వేసిందని పేర్కొన్నారు. కెసి పుల్లయ్య కంపెనీ టెండరు దక్కించుకుందని, ఆ కంపెనీ కెటిఆర్‌తో కలిసిన తర్వాత కెపిసి ప్రాజెక్ట్సు లిమిటెడ్‌గా మారిందన్నారు. ఆ కంపెనీ ప్రొద్దుటూరు, కడప జిల్లాకు చెందిన వ్యక్తులదనీ, కెపిసి కంపెనీ అడ్రెస్ విజయవాడకు మారిందన్నారు. కెపిసి ప్రాజెక్ట్స్ అనిల్ కుమార్ కామిశెట్టితో వ్యూహాత్మకంగా తెలుకుంట్ల శ్రీధర్ కెటిఆర్‌కు మేలు జరిగేలా చేశారన్నారు. దీంతో నిర్మాణ అంచనా వ్యయం రూ. 127 కోట్ల నుంచి అంచెలంచెలుగా రూ. 179 కోట్లకు పెరిగిందన్నారు.

ఇంత ఖర్చు చేసి కట్టిన స్మారకంలో కేవలం అమరవీరులకు జోహార్లు అని మాత్రమే రాసి సరిపెట్టడం సరికాదని రేవంత్ అన్నారు. శిలాఫలకంపై అమరుల పేర్లు పెట్టనప్పుడు రాష్ట్రంలో శిలాఫలకాలపై సిఎం కెసిఆర్ పేరు ఎందుకు పెట్టాలి అని ప్రశ్నించారు. చరిత్రను మలినం చేసేందుకే కెసిఆర్ కుట్ర చేస్తున్నారని, దీన్ని తెలంగాణ సమాజం గ్రహించాలన్నారు. వందలాది మంది వీరుల త్యాగాలను కేసీఆర్ కాలగర్భంలో కలిపేశారన్నారు. శ్రీకాంతాచారి, ఇషాన్ రెడ్డి, కానిస్టేబుల్ కిష్టయ్య... వందలాది మంది అమరులు గుర్తొచ్చేలా ఉండాలన్నారు. పవిత్రమైన అమరుల స్మారకాన్ని ఆంధ్రా కాంట్రాక్టర్లకు ఇచ్చి అపవిత్రం చేశారని విమర్శించారు. దేవాలయం, మసీదు, చర్చి ఎంత పవిత్రమైనవో అమరుల స్మారకం అంత పవిత్రమైందన్నారు. పది ఎకరాల్లో నిర్మించిన ప్రగతి భవన్ పనులను తొమ్మిది నెలల్లోనే పూర్తి చేస్తే.... అమరవీరుల స్థూపాన్ని నిర్మించడానికి తొమ్మిదేండ్లు పడుతుందా...? అని అని ప్రశ్నించారు. అమరవీరుల స్మారకం నిర్మాణంలో కెటిఆర్ కమీషన్లు దండుకుంటున్నా కేసీఆర్‌కు కనిపించదా? అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో 1200 మంది చనిపోయారని తాము ఎక్కడా చెప్పలేదంటూ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చెప్పడం సిగ్గుచేటన్నారు. ఆ నెంబర్ ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదా? అని ప్రశ్నించారు. తొలి, మలి ఉద్యమాల్లో 1569 మంది అమరులయ్యారని కెసిఆర్ నిండు సభలో (2014, జూన్ 14న) చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఆనాడు ప్రభుత్వ తీర్మానాన్ని అన్ని రాజకీయ పక్షాలు ఏకగ్రీవంగా ఆమోదించారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 1,569 మంది అమరుల పేర్లు శిలాశాసనంలో పొందుపరుస్తామని, ఆ వివరాలు చదివాకే అమరుల స్మారక స్థూపం దగ్గరికి వెళ్లేలా ఏర్పాట్లు చేస్తామని వ్యాఖ్యానించారు. హజ్ యాత్రికులను పంపడానికి వెళుతున్న షబ్బీర్ అలీని గృహ నిర్బంధం చేయడం దుర్మార్గమన్నారు. బిజెపి అధ్యక్షులు బండి సంజయ్ కెఎ పాల్ లాగే మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆయన మాటలను అంత సీరియస్‌గా తీసుకోవాల్సిన పనిలేదని చెప్పారు.

గచ్చిబౌలిలో అనాథలతో రెస్టారెంట్ ప్రారంభం

- ఏన్షియంట్ స్టోన్ ఫ్లేమ్స్ బిబిక్యు అండ్ గ్రిల్ ఏర్పాటు

హైదరాబాద్ : నగరంలోని గచ్చిబౌలిలో ఏన్షియంట్ స్టోన్ ఫ్లేమ్స్ బిబిక్యు అండ్ గ్రిల్‌ను ఏర్పాటు చేసింది. దీన్ని ఆ సంస్థ యాజమాన్యం గురువారం ఆదర్శ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థకు చెందిన చిన్నారుల చేత లాంచనంగా ప్రారంభింపచేయడం విశేషం. తమ ఈ మొదటి శాఖ రుచికరమైన ఆహారానికి వేదికగా నిలుస్తుందని అభిలాష్ కుమార్ యలమంచిలి పేర్కొన్నారు. ఇది మరపురాని భోజనాన్ని అందించనున్నామన్నారు. మొత్తం తొమ్మిది స్టార్టర్లతో పాటు మెయిన్ కోర్సు , సలాడ్ డెజర్ట్‌లు, ఇంకా కుల్ఫీలు అందిస్తామన్నారు. కిడ్స్ కౌంటరులో పిల్లలకు కావాల్సిన చిరుతిళ్లు చాక్లెట్లు, కాండీ వంటివి ఉంటాయని హరిణి రెడ్డి పెద్దిరెడ్డి పేర్కొన్నారు. జూబ్లీ హిల్స్‌లో మరో రెస్టారెంట్‌ను ప్లాన్ చేస్తున్నామన్నారు.

డిపిఎస్‌లో యోగా దినోత్సవ వేడుకలు

హైదరాబాద్ : అంతర్జాతీయం యోగా దినోత్సవ వేడుకలు నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో (డిపిఎస్)లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తమ విద్యా సంస్థల్లోని 5, 6వ తరగతి విద్యార్థులకు ఉత్సాహభరితమైన వేడుకలు నిర్వహించినట్లు ఆ సంస్థ యాజమాన్యం పేర్కొంది. 'ఒక భూమి ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు' కోసం సామూహిక ఆకాంక్షను ప్రతిబింబించేలా 'వసుధైవ కుటుంబానికి యోగా' అనే ఈ సంవత్సరం థీమ్‌ను దృష్టిలో ఉంచుకుని యోగా గురువుల మార్గదర్శకత్వంలో విద్యార్థులు యోగా భంగిమలను అభ్యసించారని తెలిపింది. సీనియర్ ప్రిన్సిపల్ సునీతరావు విద్యార్థులందరినీ ఉద్దేశించి వర్చువల్‌గా ప్రసంగించారని పేర్కొంది.